9

# ఆత్మగౌరవం

'బాతాల పోశెట్టి' పేరిట రాసిన కాలమ్స్

"ఇంట్ల ఈగల మోత – బయట పల్లకీల మోత"

"ఏమైందిర?"

"మొగన్ని గొట్టి మొగసాల కెక్కిందట ఎనకట నా అసోంటిది ఎవతో?"

"అసలు ఏమైందిర?"

"పొగాకుకు గిట్టుబాటుధర కావాల్నని రైతులు లొల్లిపెడ్తె ఈ ఎన్టీఆర్ దొర కాల్సి సంపిండు"

"అయ్యో! రైతులకు లాభంజేత్త ననెగదర?"

"ఇదేంది కనవడ్తలేదా? ఈ పొగాకు ధర గూడ పెంచే తాకతు ఈ దొరకు లేదు. ఇందిరాగాంధి పెంచాలె. ఒక్క పొగాక్కే కాదు వడ్లకు, గోధుమలకు, చెరుకుకు దేనికైనా గిట్టుబాటుధర యిందిరగాంధే పెంచాలె. మరి తన చేతుల లేనోడు. ఔ నిజమే పెంచాలె ననవచ్చుగద. అట్లనలే. ఇందిరగాంధి బంటుతీర్గ కాల్సి సంపి సచ్చినోల్లకు నష్టపరిహారం అని యిచ్చి చేతులు దులుపుకుని యిపుదు "ఔ! అడుగాలె!' అని ఏమెరుగనోని తీర్గ మొకం బెట్టిండు"

"చిన్న చిన్నతప్పులు అందరు జేత్తరు గనీ ఆడోల్లకు గూడ కొడుకులతో సమానం పాలుపంచియ్యాల్నని చేసిండట గదర?"

"ఎవడు నీకు చెప్పినోడు?"

"నీ అసోంటోడు అనంగ యిన్న"

"వాని జుట్టు... నీ జుట్టు తియి! అది ఈ దొర చేతులలేదు. దాన్ని గూడ యింద్రగాంధే అమలుజెయ్యాలె! మేం తీర్మానం జేసినంకగూడ చేస్తలేదు. ఆడిది ఆడోల్లకు మేలుజెయ్యనిత్తలేదు అని యిందిరాగాంధిని బదునాం జేసుటానికి

అక్కరకత్తదని ఉపాయం జేసిండు. అది అమలు కావాల్నంటే దేశం మొత్తం మీద చట్టం మార్చాలె!"

"అట్లనే ఏదో సభను రద్దు చేసిండంట గదర"

"ఔ! అక్కరకురాని ఎంటికె ఏ రేవున పోతేంది? అన్నట్టు తన పార్టోడు ఒక్కడులేడని శాసనమండలి రద్దుకు తీర్మానంజేసిండు. దాన్నిగూడ యిందిరగాంధే అమలుజెయ్యాలె."

"అసలు ఆ సభల ఎవలుంటర్రా?"

"వోడిపోయిన మన గుండి జగపతిరావు దొరను బియ్యే సదివినోల్లంతగల్సి మల్ల గెలిపిచ్చిర్రని అనలేదాయె అగో గది! గదాన్ని లెజిస్లేటివ్ కౌన్సిల్ అంటరు. ఓడిపోయినోల్లు ఎక్కుటానికి యింటెనక తొవ్వ అది. ఆల్లను ఎమ్మెల్లె అంటే ఈల్లను ఎమ్మెల్సీ అంటరు"

"ఔగని మొన్న సభల మన మంత్రిని ఏమో అన్నరట గదర?"

"లక్ష రూపాయల లంచం తీసుకున్నడని యిందిరాగాంధి కోడలు పేరుమీద ఎన్టిరాంరావు పేరుమీద కల్సి గెల్సినోడు బదునాం జేసిండు"

"నిజమేనంటవ?"

"ఏమో ఎవలకెరుకగని మంత్రిగిట్ట లంచంకు ఆశపడేదుంటే గీలక్షవెందుకే? పది యిరువై లక్షలు తీసుకుంటరుగని?"

"మంచిమాటన్నవుగని! ఆల్లేమో శర్తుగట్టుకున్నరట గదర"

"ఆఁ నువు కల్లు మండువకాడ వాడెంత? వీడెంత? అని అన్నట్టు"

"ఓర్నీయ్యక! ఎమ్మెల్యేల సభగూడ కల్లుమండువకాడ వదిరినట్టు వదురుటానికే ఉన్నాదిర?"

"లేకపోతే ఏందె? రుజువుజేస్తె మంత్రిపదవికి రాజీనామా చేస్తనన్నడు. రుజువు చెయ్యపోతే ఎమ్మెల్లెగిరికి రాజీనామా చేస్తన్నడు బదునాం చేసినోడు. ఇసోంటియి జేసిండా యిదివరకు?"

"ఓర్నీయక్క! ఓట్లేసి గెలిపిచ్చినంక గిట్ల కల్లుమండువకాడ ముచ్చట్లు వెట్టినట్టు

పెట్టుకుంట వోలి ఆడినట్టు చెరింత బురుద పూసుకుంటరంటవు! ఆడికిపోయి ఆల్లుజేసేపని గిదేనా?"

"యింక గక్కడ కేరళల తలకాయ పుర్రెలు పలగొట్టుకున్నరు. అందరు గెల్సిన పెద్దమనుషులే మరి!"

"దీనింట్ల పీస్గెల్ల! రాజ్యమేలుడంటె గిదేనార... గట్లెందుకు చేసుదుర?"

"దొంగలు దొంగలు ఊర్లు వంచుకునేకాడ లెక్క కుదరక"

"ఎవలు ఆపలేదుర?"

"ఎందుకు అబ్బట్టలేదే! పోలీసోల్లు ఉరికచ్చి పత్రికోల్లు కూసుండె అర్రలేసి ఒక్కొక్క ఎంఎల్యేను జోపేది జోపిన్రు"

"రాజ్యాలేలె ఎమ్మెల్లెలను పోలీసులు జోపినంక ఇగ గిదేంరాజ్యంరో!"

"జోపుడు రాజ్యం"

"గంతేనంటవ? మరి మన రాజ్యం గూడ గసొంటిదేనా?"

"మల్ల మొదటికత్తివేమే? పొగాకు రైతులు ఎట్ల జచ్చిన్రు. పోలీసుల చేతులగాదా?"

"గట్లంటవేంర? నక్సలైట్లు తనతోటి చెయ్యిచెయ్యి కలుపుతె మూర్రోజులల్ల పేదోల్ల రాజ్యం తెస్తననెగదర?"

"అన్నడు నిజమేగని! మొన్న హైద్రాబాదుల పెద్ద పెద్ద ఊరేగింపులు దీసి సభలువెట్టి గసొంటి పేదోల్లమీద నక్సలైట్లమీద పెట్టిన దొంగకేసులు రద్దుచేయాలని - కల్లోలిత ప్రాంతాల చట్టం ఎత్తివేయాల్నని, అన్యాయంగ జేల్లేసినోల్లను యిడిసిపెట్టాల్నని అడుగుతె - తుపాకికి తుపాకితోటే జవాబిస్తనన్నడట"

"అంటే అంతా ఏరుదాటి తెప్పకాల్సుడు రకం అంటవు"

"నేననేదే మున్నదె కనవడ్తలేద?"

"మొన్న యిరువైవేలమంది నౌకరిగాల్లు దిగిపోతె ఇంక భర్తీ చెయ్యలేగని, పోలీసోల్లను దబదబ భర్తిచేస్తన్రు. మరి తెలుగువాల్ల ఆత్మగౌరవం నిలబడాలంటె పోలీసోల్లుగూడ పాటువడ్తరుగద"

"అందర్ని జోపుకుంటనార?"

"ఒక్క జోపుడేనా? తొవ్వపొంట కనవడ్డోన్నల్ల నకల్‌చిట్టీలు అందిస్తున్నడని వీపంత సాపుజేసుడు. పరీక్ష అర్రల సొచ్చి పరీక్ష రాసెటోల్లను తన్నుడు. నకలు చిట్టీలు గుంజుడు. ఎక్కువ తక్కువ మాట్లాడ్తె టీచర్లనుగూడ ఏసుడే."

"ఎందుకుర గింతగనం?"

"అగో గట్లంటవెమ్మే. నిరుద్యోగ సమస్య లేకుంట జేత్తనన్నడుగద దొర, అందరు పాసైతె ఎంత తిప్పలే? కాలేజీ సీట్లు కావాలంటరు. నౌకర్లు కావాలంటరు. అందర్ని ఫేల్‌జేత్తె ఇగ నౌకరి గావాల్నని ఎవడడుగుతడే? గిట్ల నిరుద్యోగ సమస్య పరిష్కారమైతది."

"అయితె తనుచేసేటియి గిట్ల వంకర తొవ్వల వోవుకుంట, యిందిరాగాంధీ చేసేదానికి దబదబ తీర్మానం జేత్తడంటవు"

"ఇగ నేననేదేమున్నది?"

**'చాటింపు' పక్ష పత్రిక 1983**